
జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘనంగా త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర

వనస్థలిపురం, మే 14(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని ప్రసిద్ధ త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని దైవారాధనకు కేటాయిస్తు, మానసిక ప్రశాంతతను పొందాలన్నారు. స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి జాతర ఉత్సవాలకు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముద్దగౌని చంద్రకాంత్ గౌడ్, సుమన్‌గౌడ్, సతీష్ కుమార్‌గౌడ్, సుధాకర్‌యాదవ్, నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, మే 14 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే అహ్మద్ బలాల మంగళవారం రాత్రి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారిలో 58మంది లబ్ధిదారులకు రూ.28.76లక్షల విలువ గల చెక్కులు మంజూరయ్యాయని, వాటిని పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు.


రైతులతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్రూర్, గౌరెల్లి, బండరావిరాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలులో ఏర్పడుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని అధికారులకు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉందని ఎప్పటికప్పుడు రైతుల నుంచి ధాన్యం సేకరించాలని చెప్పారు.


సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు భూపాల్, ఎల్లయ్య

సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ

చంపాపేట, మే 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరుగనున్న సమ్మెలో కార్మికులందరు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య కోరారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ సాగర్‌రింగ్‌రోడ్‌లోని మార్బుల్స్ హమాలీ వలస కార్మికులతో బుధవారం సమావేశమైనారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఆలేటి ఎల్లయ్య పాల్గొని మాట్లాడారు. కార్మికులతో కలిసి వారు సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏదుల గోవిందు, బాలయ్య, లాలునాయక్, దుర్గారావు, అజయ్, కృష్ణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

మన్సూరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. కార్మికులను బానిసలుగా చేసే కార్మిక వ్యతిరేక చట్టాలు, లేబర్ కోడ్ల రద్దునకై ఈనెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆటోనగర్‌లోని కార్మికులను కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, సభ్యులు ఆలేటి ఎల్లయ్య, చింతపల్లి కృష్ణయ్య, సుధీర్, దయానంద్, రాజకుమార్, దిగంబర్, సచిత్ పాల్గొన్నారు.


కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కమలానగర్ సీనియర్ సిటిజన్లు

సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం, మే 14(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీనియర్ సిటిజన్లు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, గోవర్ధన్, సారంగం, విట్టల్, అక్షయ, సత్యమూర్తి పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా హోమాది పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


వైభవంగా అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

మన్సూరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో అభయాంనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన బుధవారం ఆలయ అర్చకులు చల్లా బాలమురళీకృష్ణశర్మ, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆవాహిత, మంటపపూజ, ధాన్యాధివాసాంగ, హవనములు, గర్తసంస్కారం, నవరత్నన్యాసం, యంత్ర, విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠలు, దృష్టికుంభం, బలిహరణం, పూర్ణాహుతి, యజ్ఞభస్మతిలకాధారణ, కలశోదక మార్జనం వంటి పూజలతో పాటు సాయంత్రం బి.భాస్కర్, భక్తి రంజని బృందంచే సర్వనామ సంకీర్తనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ ఆధ్వర్యంలో కాసుల చంద్రశేఖరశాస్త్రీ నిర్వహణలో ఈ ఉత్సవాలు విజయవంతంగా జరిగాయి.

నాదర్‌గుల్ లింగస్వామి జాతరకు వేళాయె..!

- ఉత్సవాలకు సిద్ధమైన లింగమయ్య గుట్ట
- రేపటి నుంచి మూడు రోజుల పాటు జాతర
- ఆదివారం స్వామి వారి కల్యాణం.. అనంతరం బోనాల మహోత్సవం


గుట్టపై గర్భాలయంలో కొలువుదీరిన లింగమయ్య


నాదర్‌గుల్‌లోని లింగమయ్య గుట్ట, గుట్టపైకి మెట్ల దారి

సరూర్‌నగర్, మే 14(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని అతి పురాతనమైన లింగమయ్యగుట్ట జాతరకు ముస్తాబయింది. పచ్చని వ్యవసాయ పొలాల మధ్య, చుట్టూ గుట్టలు, గుబురు చెట్లతో ఆహ్లాదభరితంగా కనిపించే ఈ గుట్టపై జరిగే జాతర.. సూర్యాపేట్ జిల్లాలోని దురాజ్‌పల్లి లింగమంతుల జాతరను తలపిస్తుంటుంది. నాదర్‌గుల్ నుంచి ఆర్‌సీఐ రహదారికి వెళ్లే రోడ్డులో కుర్మల్‌గూడ-రాగన్నగూడ గ్రామాల సమీపంలో గల ఎత్తైన గుట్టపై బండరాళ్ల మధ్య స్వయంభుగా వెలిసిన లింగమయ్యను భక్తులు వేనోళ్ల కొలుస్తుంటారు. సాధారణ పండుగలు, పర్వదినాల్లో కొద్ది మంది భక్తులు మాత్రమే ఇక్కడకు వస్తుంటారు. అయితే జాతర సమయంలో మాత్రం ఇసుక వేస్తే రాలనంతగా జనం వస్తారు.

ఆదివారం కల్యాణోత్సవం.. బోనాల సమర్పణ..

శుక్రవారం ప్రారంభం కానున్న జాతరలో భాగంగా ఆ రోజు సాయంత్రం పుట్ట కప్పే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇక శనివారం ఉదయం పుట్ట బంగారం తేవడం, లింగస్వామికి గంగాజలంతో అభిషేక పూజ నిర్వహించి సాయంత్రం 4గంటలకు గంప జాతర నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 11.15 గంటలకు శ్రీలింగస్వామి మాణిక్యాలదేవి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించనున్నట్టు యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం నాగవెల్లి నిర్వహించి, అనంతరం స్వామి వారికి గుట్ట దిగువన మెట్ల మార్గం పక్కన గల బోనాల గుండు వద్ద బోనాలు సమర్పించనున్నారు. సాయంత్రం అగ్నిగుండాలు, బలి, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గతంలో రాళ్లతో మెట్ల మార్గం..

గతంలో ఈ గుట్టపైకి రాళ్లతో కూడిన మెట్ల మార్గం మాత్రమే ఉండేది. వాహనాలు వెళ్లేందుకు సైతం దారి లేదు. కాగా ప్రస్తుత ఉత్సవాల సందర్భంగా మెట్ల మార్గాన్ని సిమెంటుతో ఆధునీకరించి మెట్లపై నడిచే భక్తులకు ఎండ తగులకుండా చలువ పందిళ్లు వేశారు. మెట్ల మార్గం పక్క నుంచి గుట్టపైకి కొత్తగా రోడ్డు మార్గం సైతం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం గుట్టపై స్థలాన్ని చదును చేసి చలువ పందిళ్లు వేయిస్తున్నారు. ఇక గుట్ట దిగువన గల వ్యవసాయ పొలాల్లోనూ భారీ ఎత్తున చలువ పందిళ్లు వేయించారు.


శివయ్యను దర్శించుకోవాలంటే ఈ బండరాళ్ల కింది నుంచి దూరి వెళ్లాల్సిందే

జాతరకు వచ్చే భక్తులు గుట్టపైన గల చౌడమ్మతల్లి ఆలయాన్ని సైతం దర్శించుకోవచ్చు. గతంలో అక్కడ జంతు బలి చేసేవారు. ఈ సారి గుట్ట కిందే మెట్ల మార్గం పక్కన బలి స్థలం ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల కోసం తాగునీటి వసతితో పాటు ఇతర సౌకర్యాలు సైతం కల్పిస్తున్నట్టు శ్రీగోపాలకృష్ణ యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు. వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బంది సైతం తగిన ఏర్పాట్లు చేస్తున్నారని, పోలీసు విభాగం వారు బందోబస్తు చేపట్టనున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు లింగస్వామిని దర్శించుకుని, ప్రశాంత వాతావరణంలో లింగమయ్య జాతర జరుపుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

1965లో మొదటి జాతర.. అరవయ్యేళ్ల తర్వాత ఐదో జాతర..

లింగమయ్య గుట్టపై 1965లో మొదటిసారి స్థానిక యాదవులు, గ్రామ పెద్దలు కలిసి జాతర నిర్వహించినట్టు ఉత్సవ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన శ్రీగోపాలకృష్ణ యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆ తర్వాత 1976లో రెండోసారి, 1995లో మూడోసారి, 2012లో నాలుగోసారి లింగస్వామి జాతర నిర్వహించారు. తాజాగా 2025లో నిర్వహించే జాతర ఐదవది కాగా.. 60 ఏళ్ల తర్వాత ఐదో జాతర జరుగనుండడం ఓ ప్రత్యేకతగా యాదవ సంఘం ప్రతినిధులు పేర్కొంటున్నారు.

పంటలకు పచ్చిరొట్ట ఎరువులను వాడండి

- వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్


రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14(ఆంధ్రజ్యోతి): పంటలకు పచ్చి రొట్ట ఎరువులను వాడాలని రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ జి. శ్రీనివాస్ రైతులకు సూచించారు. బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై వ్యవసాయంలోని వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సూచించిన మోతాదులో పంటలకు రసాయన ఎరువులను వాడాలని, పచ్చిరొట్ట ఎరువులకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా.. పంట మార్పిడి విషయంలో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోవాలన్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి, లాభం వచ్చే పంటలపై రైతులు దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పంట తెగుళ్లు, నేల సారం పెంచే విధానాలు, పర్యావరణ సంరక్షణ వాటిపై శాస్త్రవేత్తలు కవిత, డాక్టర్ జెమీమా వివరించారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన పలు ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త ఎస్ పల్లవి, మండల వ్యవసాయ అధికారి ఐ. పల్లవి, విస్తరణ అధికారి రఘుపతి, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సెల్లార్ నిర్మాణాన్ని కూల్చిన అధికారులు


కూల్చివేసిన సెల్లార్

సైదాబాద్, మే14(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న సెల్లార్‌ను బుధవారం జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బం ది పోలీసుల సహాయంతో కూల్చివేశారు. ప్రమాదకరంగా మారిన సెల్లార్ నిర్మాణంపై మూడు నెలలుగా కాలనీవాసులు, బీజేపీ నేతలు పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు రెండు సార్లు నోటీసులు జారీ చేసినా భవన యజమాని నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. దీంతో కాలనీవాసులు, బీజేపీ నేతలు నిర్లక్ష్యంపై ఆందోళనకు సిద్ధపడిన నేపథ్యంలో అధికారులు స్పందించి కూల్చివేశారు.


మనువడితో చెక్కును అందిస్తున్న సత్యప్రకాశ్

సైనిక సంక్షేమ నిధికి లక్ష రూపాయల విరాళం

- సత్యప్రకాశ్‌ను అభినందించిన కాలనీవాసులు

సైదాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలర్పించిన వీర సైనికుల కుటుంబాలను ఆదుకునే బాధ్యతగా తన వంతుగా సాయుధ దళాల పతాక నిధికి సైదాబాద్ డివిజన్ ఎస్‌బీహెచ్ బీ కాలనీకి చెందిన బుర్రా సత్యప్రకాశ్ భరద్వాజ్ లక్ష రూపాయల చెక్కును బుధవారం విరాళంగా ఇచ్చారు. మనువడి రామ్ మొదటి జన్మదిన వేడుకల్లో చెక్కును కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు చిన్నారితో అందించారు. గురువారం ఆ చెక్కును హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు కాలనీ ప్రతినిధి రావికంటి శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా సత్యప్రకాశ్‌ను కాలనీవాసులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

అక్రమ నిర్మాణాలపై కంటితుడుపు చర్యలు

- ఒకటి, రెండింటికి నోటీసులు జారీ చేసి చేతులు దులుపేసుకున్న టౌన్-ప్లానింగ్ అధికారులు
- నోటీసులు ఇచ్చినా యథేచ్ఛగా పనులు

అబ్దుల్లాపూర్‌మెట్ : నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కంటితుడుపు చర్యలు చేపట్టి చేతులు దులుపేసుకుంటున్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై 'రెసిడెన్షియల్ అనుమతులు..కమర్షియల్ నిర్మాణాలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి ప్రతికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. అయితే ఇక్కడ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు తమ తెలివి తేటలు ఉపయోగించారు. అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లకుండా.. కేవలం భవన నిర్మాణ అనుమతులు పొంది కమర్షియల్ షెడ్లు చేపడుతున్న ఒకటి, రెండు నిర్మాణాలకు మాత్రమే కంటితుడుపుగా నోటీసులు జారీ చేసి తమపని అయిపోయిందని అధికారులు చేతులు దులుపేసుకున్నారు.

యథేచ్ఛగా కొనసాగుతున్న పనులు

మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు అధికారులు నోటీసులు జారీ చేసిన అక్రమ నిర్మాణాలు సైతం యథేచ్ఛగా కొనసాగుతుండడం విశేషం. మున్సిపల్ పాలకవర్గం ముగియడంతో వార్డుల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలన్నీ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు వస్తే నోటీసులు ఇస్తాం అంటూ చెప్పి అధికారులు తప్పించుకోవడం పరిపాటిగా మారింది. నోటీసులు ఇవ్వడం వరకే తమ పని అని నిర్మాణాలను కూల్చే అధికారం తమకు లేదని టౌన్‌ప్లానింగ్ అధికారులే చెప్పడం ఆశ్చర్యం కలిగించే విషయం. ఈ విషయంపై రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే..

అత్తింటి వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య

- భర్త కుటుంబ సభ్యులే హత్య చేశారు : మృతురాలి తండ్రి


భర్త పెండెం రాజశేఖర్‌తో జాస్మిని(ఫైల్)

కొత్తపేట, మే 14(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధి శివపురి కాలనీలో అత్తింటివారి వేధింపులు భరించలేక గృహిణి జాస్మిని(28) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. భర్త కుటుంబ సభ్యులే తన కుమార్తెను హింసించి, ఉరి వేసి హత్య చేశారంటూ మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, మృతురాలి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం .. ఖమ్మంలో ఉండే కట్టా వెంకటేశ్వర్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆయన కుమార్తె జాస్మినిని 01.09.2009 తేదీన ఎల్బీనగర్ శివపురి కాలనీలో ఉండే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పెండెం రాజశేఖర్(34)కు ఇచ్చి పెళ్లి చేశారు. జాస్మిని తల్లిదండ్రులు కట్నకానుకలుగా రాజశేఖర్‌కు రూ.25లక్షల నగదు, 20తులాల బంగారు ఆభరణాలు ఇచ్చారు. పెళ్లి అయిన 6నెలల నుంచే ఆమెకు భర్త సహా అత్తింటి వారందరి వేధింపులు మొదలయ్యాయి. అదనపు కట్నం కోసం ఆమె భర్త, అతడి తమ్ముడు, ఆడబిడ్డ, ఆడబిడ్డ భర్త జాస్మినిని పలు రకాలుగా వేధించేవారని వెంకటేశ్వర్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తొలుత వారు మానసికంగా శారీరకంగా హింసించి ఆమెను ఖమ్మంలోని తల్లిగారి ఇంటికి పంపించారు. జాస్మినికి పిల్లలు కలుగలేదు. వెంకటేశ్వర్లు కుమార్తెకు, అల్లుడికి ఖమ్మం మహిళా పీఎస్‌లో నాలుగు వారాల పాటు కౌన్సెలింగ్ ఇప్పించారు. ఆ తర్వాత నాలుగు నెలల క్రితమే అతడి కుటుంబ సభ్యులందరూ బ్రతిమిలాడితే జాస్మినిని వారివెంట పంపించారు. అనంతరం వారందరూ తండ్రి జీతం, ఆస్తుల వివరాలు అడిగి భయపెట్టేవారు. రెండు నెలల నుంచి తరచూ హింసిస్తూ కొడుతున్నారని ఆమె పలు మార్లు తనకు చెప్పిందని వెంకటేశ్వర్లు ఫిర్యాదులో విన్నవించారు. మంగళవారం సాయంత్రం అల్లుడు రాజశేఖర్ తనకు ఫోన్‌చేసి జాస్మిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని చెప్పి ఫోన్ కట్ చేశాడని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటేశ్వర్లు కుటుంబ సభ్యులు వచ్చి చూడగా జాస్మిని విగత జీవిగా కనిపించిందని, శరీరంపై కమిలిన గాయాలున్నాయని రాజశేఖర్ సహా అతడి కుటుంబ సభ్యులు జాస్మినిని హత్య చేసి, ఉరేసారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఆయన ఫిర్యాదుతో పోలీసులు డౌరీ డెత్ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం వివరాల ఆధారంగా కేసు దర్యాప్తు కొనసాగుతుందని ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపారు. రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

నేటి నుంచి అనాజ్‌పూర్‌లో హజ్రత్ ఖాజా బందే నవాజ్ షరీఫ్

- దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాజ్‌పూర్‌లో హజ్రత్ ఖాజా బందేనవాజ్ షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు ముతావలి గులాం అంజాద్‌ఖాన్ తెలిపారు. గురువారం సాయంత్రం 6గంటలకు మజీద్ ఏ బిలాల్ నుంచి ఊరేగింపుతో వెళ్లి గంధం సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. 16న ఫతేహా, 17న ఉర్సు ముగింపు ఉంటుందని తెలిపారు. హిందు, ముస్లింలు ఈ ఉత్సవాల్లో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ ఆత్మహత్య


అనూష(ఫైల్)

సైదాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మహిళ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల ప్రకారం.. సైదాబాద్ పీఎస్ పరిధిలోని శంకేశ్వర్‌బజార్ సాయిరాంనగర్‌లో నల్గొండ జిల్లా పరకాల గ్రామానికి చెందిన అనూష(26), వెంకటేష్‌ల కుటుంబం నివసిస్తుంది. వీరికి ఇద్దరు కుమారులు. వెంకటేష్ ప్రైవేటు హాస్టల్‌లో కుక్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి భార్యభర్తలు గొడవపడ్డారు. బుధవారం ఉదయం లేచి చూసే సరికి అనూష గదిలో ఉరేసుకొని ఉంది. దీంతో భర్త గమనించి అనూషను వెంటనే స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. వెంటనే అతడు గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని గ్రామానికి తరలిస్తుండగా పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో సైదాబాద్ పోలీసులు మృతదేహాన్ని వెనుకకు పిలిపించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి


బావిలో పడిన గీత కార్మికుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లి గ్రామానికి చెందిన అంతటి సంతోష్‌గౌడ్(45)) గీత కార్మికుడు. మంగళవారం ఉదయం తన సొంత వ్యవసాయ పొలంలో తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. బావిగడ్డపై ఉన్న చెట్టును ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు నడుముకు ఉన్న గొలుసు తెగిపోవడంతో అతడు చెట్టుపై నుంచి నేరుగా బావిలో పడ్డాడు. దీంతో తలకు గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం వెళ్లిన అతడు రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన అతడి భార్య ఫోన్ చేసినా సిగ్నల్ కలువలేదు. వెంటనే అతడి కుమారుడు ముఖేష్ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి సంతోష్ కోసం వెతికాడు. తాటిచెట్టుకు మోకు, చెట్టు మొదలు వద్ద చెప్పులు కనిపించగా పక్కనే ఉన్న బావిలో చూడగా సంతోష్ కనిపించాడు. ఈ విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం అందించాడు. అప్పటికే అతడు మృతిచెందాడు. బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా అనంతరం ఉస్మానియాకు పంపించారు. మృతుడి భార్య ఉష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గీత కార్మికుడి మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు


వీధి కుక్క పిల్లను దత్తతగా అందజేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, డీసీ యాదయ్య

వీధి కుక్కపిల్లల దత్తత, సంరక్షణపై అవగాహన

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ డివిజన్ హరిణ వనస్థలి వాకింగ్ పార్కులో బుధవారం వీధి కుక్క పిల్లలను దత్తత తీసుకుని సంరక్షించే విధానంపై అవగాహన కల్పించారు. జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ వీధి కుక్క పిల్లలను సంరక్షించడం ద్వారా కరవకుండా వాటిని మనకు అనుగుణంగా మలచుకోవచ్చన్నారు. వీధి కుక్కలు పునరుత్పత్తి కాకుండా నాగోల్ ఫత్తుల్లాగూడలో జనన నియంత్రణ సెంటర్ ఉందని, ఆ సెంటర్ యాంటీ రాబీస్ వ్యాక్సినేషన్ సైతం ఇవ్వడం జరుగుతుందన్నారు. పలువురికి వ్యాక్సినేషన్ ఇచ్చిన వీధికుక్క పిల్లలను దత్తతగా అందజేశారు. వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ రంజిత్, డాక్టర్ రవిచందర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.